
మల్లికార్జుననగర్‌లో చిత్తడిగా మారిన రహదారులు




ఇళ్లలోకి వచ్చిన వర్షపు నీటిని బయటకు తోడుతున్న వ్యక్తి


ఆర్ఆర్‌నగర్‌లో కొత్తగా ఏర్పాటు చేసిన నాలా వద్ద..


హెచ్ఏఎల్ పార్కు, లక్ష్మీనర్సింహకాలనీలో నేలకొరిగిన చెట్టు

వర్షం కురిసిన ప్రతిసారి!

రెండ్రోజులుగా వర్షపునీటిలోనే కాలనీ రహదారులు


ఆర్ఆర్‌నగర్, ఎంఎంఆర్ గార్డెన్ లైన్, కళింగ ఎన్‌క్లేవ్ నీట మునిగిన రహదారులు



ఓల్డ్‌బోయిన్‌పల్లి డివిజన్‌లోని రహదారులు ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి నిండి పోయాయి. రెండు రోజులైనా కాలనీ రహదారులపై వరషపు నీరు నిలిచి ఉంది. వర్షం పడిన ప్రతిసారి డివిజన్‌లోని పలు కాలనీల్లో ఇదే పరిస్థితి అని స్థానికులు చెబుతున్నారు. మల్లికార్జున్‌నగర్‌లో కాలనీలో వర్షం పడితే 3–4రోజుల పాటు వర్షపునీరు నిలిచిపోతుంది. ఈ సమస్యకు నేటికీ పరిష్కారం చూపలేదని స్థానికులు పేర్కొంటున్నారు. కళింగ ఎన్‌క్లేవ్, ఎంఎంఆర్ గార్డెన్ రహదారిలోని అపార్ట్‌మెంట్ సెల్లార్లు వర్షం పడిన ప్రతిసారి నిండిపోతున్నాయి. బ్యాంక్‌కాలనీ, భాగ్యశ్రీ గార్డెన్, అంజయ్యనగర్, హస్మత్‌పేట, హరిజన బస్తీ, ముస్లిం బస్తీల రోడ్లు చిన్నపాటి చెరువులను తలపించాయి. ప్రస్తుతం ఈ రోడ్లపై వర్షపునీరు కాస్త తగ్గింది. ఆర్ఆర్‌నగర్ నాలా నిర్మాణం పూర్తికాకపోవడంతో వర్షపునీరు కాలనీలోనే నిలిచిపోయిందని స్థానికులు చెబుతున్నారు. హెచ్ఏఎల్ పార్కులో విరిగి పడిన చెట్లను తొలగించడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. లక్ష్మీనర్సింహకాలనీలో విరిగిన చెట్లను రోడ్డు పక్కను వేసి వెళ్లడంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు కలుగుతున్నాయి. చెట్లు విరిగి కరెంట్ తీగలపై పడటంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. మరో మూడు రోజులు వర్షాలు పడే అవకాశం ఉండటంతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు.

– ఓల్డ్‌బోయిన్‌పల్లి





క్లుప్తంగా

నేటి నుంచి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు

ఓల్డ్‌బోయిన్‌పల్లి: డివిజన్ పరిధిలోని భవానీనగర్ శ్రీమద్విరాట్ పోతులూరి వీరబ్రహ్మేంద్ర స్వామి దేవస్థానంలో బుధవారం నుంచి శుక్రవారం వరకు సర్వజన జ్ఞాన మందిరం, శిలా విగ్రహాల ప్రతిష్ఠాపన మహోత్సవాలను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ ఒక ప్రకటనలో తెలిపింది. ఈ మహోత్సవంలో ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేస్తారని పేర్కొంది.

విద్యార్థికి ల్యాప్‌టాప్ అందజేత


ల్యాప్‌టాప్ అందజేస్తున్న టీఎస్‌టీఎస్ చైర్మన్ జగన్మోహన్‌రావు

ఆల్విన్‌కాలనీ: రాష్ట్ర ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ మూడేళ్ల క్రితం తన జన్మదినం సందర్భంగా అభిమానులకు, ప్రజాప్రతినిధులకు గిఫ్ట్ ఏ స్మైల్ కార్యక్రమానికి పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా మంగళవారం బాలానగర్ డివిజన్‌కు చెందిన బాలకృష్ణ, భాగ్యలక్ష్మి కుమార్తె మధురిమకు టీఎస్‌టీఎస్ చైర్మన్ పాటిమీది జగన్మోహన్‌రావు లాప్‌ట్యాప్‌ను అందించారు. తమ కుమార్తెకు ల్యాప్‌టాప్‌ను అందించినందుకు మధురిమ తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు.

నాగరాజుకు అభినందనలు


నాగరాజును అభినందిస్తున్న ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు

కూకట్‌పల్లి: మేడే సందర్భంగా రవీంద్రభారతిలో నిర్వహించిన కార్యక్రమంలో హెచ్ఏఎల్ ఉద్యోగి కార్మిక విభాగం అధ్యక్షుడు కర్క నాగరాజుకు ప్రతిష్ఠాత్మక శ్రమశక్తి అవార్డు పురస్కారం లభించింది. ఈ సందర్భంగా మంగళవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణావును మర్యాదపూర్వకంగా కలిసి ఆయన ఆశీస్సులు తీసుకున్నారు. కార్మికుల సమస్యలపై పోరాటం చేస్తున్న నాగరాజుకు అవార్డు రావటం ఆనందంగా ఉందని ఎమ్మెల్యే అన్నారు.

వాల్ పెయింటింగ్


కార్యక్రమంలో పాల్గొన్న పన్నాల హరీష్‌రెడ్డి, బీజేపీ నాయకులు

కూకట్‌పల్లి: బీజేపీ రాష్ట్ర శాఖ ఆదేశాల మేరకు ఆల్విన్‌కాలనీ డివిజన్ వాల్ పెయింటింగ్ ఇన్‌చార్జి తిరుమలగిరి శ్రీనివాసులు ఆధ్వర్యంలో మంగళవారం వాల్ పెయింటింగ్ కార్యక్రమం జరిగింది. బీజేపీ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీష్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై పెయింటింగ్ వేశారు. ఈ కార్యక్రమంలో బూత్ అధ్యక్షులు బాలు, శంకర్, ప్రగతి, సతీష్ కుమార్, చరణ్, నాయకులు అద్వానీ సూర్యారావు, అల్లూరి సీతారామరాజు, సురభి రవీందర్ రావు, నరేందర్‌రెడ్డి, వాల్ పెయింటింగ్ ఇన్‌చార్జి అక్కినపల్లి కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తారిక్ అన్సారీకి ఆర్‌యూపీపీటీ సన్మానం


తారిక్ అన్సారీని సన్మానిస్తున్న పండిత పరిషత్ నాయకులు

కూకట్‌పల్లి: తెలంగాణ మైనారిటీ కమిషన్ చైర్మన్ తారిక్ అన్సారీని హైదరాబాద్‌లో ఆర్‌యూపీపీటీ అధ్యక్షుడు మహమ్మద్ అబ్దుల్లా మంగళవారం కలిసి పుష్పగుచ్ఛం అందజేసి సత్కరించారు. ఈ సందర్భంగా తారిక్ అన్సారీ మాట్లాడుతూ.. తెలుగు, హిందీ, ఉర్దూ భాష పండితులు విద్యార్థులకు సంస్కార జీవన విధానాన్ని నేర్పుతున్నారని అన్నారు. పండితులకు కేసీఆర్ ప్రభుత్వం తప్పకుండా అన్ని రకాలుగా సహకరిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో పండిత పరిషత్ రాష్ట్ర కోశాధికారి వీఎస్ఎస్‌సీఎస్ శర్మ, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఘనపురం దేవేందర్, హైదరాబాద్ అధ్యక్షుడు హమీద్‌ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

కూరగాయల ధరలు

శేరిలింగంపల్లి: నల్లగండ్ల మార్కెట్‌లో.. టమాట 15, పచ్చిమిర్చి 50, బెండ 40, కాకర 50, దొండ 25, దోస 30, ఆలు 25, చామ 60, కీర 30, బీర 50, వంకాయ 30, గోకర 50, బీన్స్ 100, బీట్‌రూట్ 30, క్యాప్సికమ్ 50, క్యాబేజీ 20, క్యారెట్ 35, చిక్కుడు 60, ఉల్లి 100 (5 కేజీలు), ములక్కాయలు (3) 10.

కూకట్‌పల్లిలో పర్యటించిన నవీన్‌మిట్టల్

అధిక విలువ కలిగిన ప్రభుత్వ భూముల పరిశీలన

కేపీహెచ్‌బీకాలనీ: కూకట్‌పల్లి మండల పరిధిలోని అధిక మార్కెట్ విలువ కలిగిన ప్రభుత్వ భూములను రెవెన్యూ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ, సీసీఎల్‌ఏ కమిషనర్ నవీన్‌మిట్టల్, మేడ్చల్ మల్కాజ్ గిరి కలెక్టర్ అమోయ్ కుమార్‌లు మంగళవారం పరిశీలించారు. తెలంగాణ ప్రభుత్వ భూముల్లో వెలసిన ఇళ్లు, ఇళ్ల స్థలాల క్రమబద్ధీకరణ, నోటరీ స్థలాల రిజిస్ట్రేషన్‌ల విషయమై ప్రభుత్వం వేగవంతమైన చర్యలు చేపట్టిన నేపథ్యంలో వీరి పర్యటన ప్రత్యేకతను సంతరించుకొంది.

◆ కూకట్‌పల్లి మండల పరిధిలోని హైదర్‌నగర్, కూకట్‌పల్లి గ్రామాల్లోని ప్రభుత్వ భూముల్లో వెలసిన కాలనీలలో క్రమబద్ధీకరణకు దరఖాస్తు చేసుకున్నప్పటికి అధిక మొత్తంలో డబ్బులు చెల్లించి రావటంతో దరఖాస్తుదారులు సుముఖత వ్యక్తం చేయలేదు.

◆ దీంతో జీఓ.59 ద్వారా క్రమబద్ధీకరణలో ఆశించిన స్థాయిలో స్పందన లభించలేదు. రిజిస్ట్రేషన్‌ల శాఖ ద్వారా నిర్దేశించిన మార్కెట్ విలువ అధికంగా ఉన్నప్పటికి ఆయా స్థలాల్లో వీకర్ సెక్షన్ కాలనీలు ఏర్పడటంతో లక్షలాది రూపాయలు చెల్లించి క్రమబద్ధీకరణ చేసుకోవటానికి ఆసక్తి చూపలేదు.

◆ అయితే రెవెన్యూ శాఖ ఉన్నతస్థాయి అధికారులు ప్రత్యక్షంగా ఆయా బస్తీలు, కాలనీల్లో పరిస్థితిని సమీక్షించారు. హైదర్‌నగర్‌లోని రామ్‌నరేశ్‌నగర్, కూకట్‌పల్లిలోని పాపిరెడ్డినగర్, ఏవీబీపురంలో నవీన్‌మిట్టల్‌తో పాటు కలెక్టర్, తహసీల్దార్ గోవర్ధన్ తదితరులు భూములు పరిశీలించిన వారిలో ఉన్నారు. రాబోయే రోజుల్లో భూముల క్రమబద్ధీకరణ విషయంలో వీకర్ సెక్షన్ కాలనీలకు అనుగుణంగా నూతన మార్గదర్శకాలు వెలువరుస్తారని ఆశాభావాన్ని స్థానికులు వ్యక్తం చేస్తున్నారు.

పబ్లిక్ కాంటాక్ట్‌ను సద్వినియోగం చేసుకోండి


ఎల్లమ్మబండ రైతు బజార్ వద్ద జరిగిన కార్యక్రమంలో కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్, అధికారులు

ఆల్విన్‌కాలనీ: ఎల్లమ్మ బండ రైతుబజార్‌లో మంగళవారం పబ్లిక్ కాటాక్ట్ ప్రోగ్రాం పేరుతో అన్ని శాఖల అదికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో స్థానిక కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు. ఎల్లమ్మబండ పరిధిలోని కేటీఆర్ కాలనీ, జయశంకర్‌కాలనీ, గురుగోవింద్‌సింగ్ నగర్, ఎన్‌టిఆర్‌నగర్, గాంధీనగర్, పాపమ్మ బస్తీ, పంచమి కాలనీ, హనుమాన్ నగర్ కాలనీలలోని సమస్యలను తెలుసుకోవటానికి ఈ కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. అధికారులే స్వయంగా మన ప్రాంతానికి వచ్చి సమస్యలను పరిష్కరిస్తున్నందున అన్ని సమస్యలను వారి దృష్టికి తీసుకువచ్చి వీలైనంత త్వరగా పరిష్కరించేందుకు అవకాశం కలిగిందన్నారు. సుమారు 15 డిపార్టుమెంట్ అధికారులు ఒకే వేదికను పంచుకుంటున్నారని న్నారు. సమస్యలను నేరుగా చెప్పుకొని పరిష్కరించుకోవటానికి ఇది ఒక చక్కటి కార్యక్రమం అని తెలిపారు. కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు సమ్మారెడ్డి, ఉపాధ్యక్షుడు చిన్నోళ్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి గుడ్ల శ్రీనివాస్, బీఆర్‌యస్ పార్టీ నాయకులు సంగమేష్, మల్లేష్ ఖాజా, కైసర్, ఫారూఖ్, రాంచందర్, శ్రీధర్, కరుణాకర్, ఆలీ, ఫజల్, గణేష్ గౌడ్,జీహెచ్‌యంసి అధికారులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యల శాశ్వత పరిష్కారినికే పబ్లిక్ కాంటాక్ట్

ఆల్విన్‌కాలనీ: ప్రజా సమస్యలను శాశ్వతంగా పరిష్కరించేందుకు పబ్లిక్ కాంటాక్ట్ కార్యక్రమం ఎంతగానో ఉపయోగపడుతుందని పాపిరెడ్డినగర్ బస్తీ అధ్యక్షుడు ఊట్ల చంద్రారెడ్డి పేర్కొన్నారు. శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ ఆదేశాలతో మంగళవారం బస్తీలో నిర్వహించిన పబ్లిక్ కాంటాక్ట్ కార్యక్రమంలో వివిధ విభాగం అధికారులతో కలిసి చంద్రారెడ్డి పర్యటించి స్థానిక సమస్యలపై అధికారులకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో బస్తీ ప్రధాన కార్యదర్శి భగవంత్‌రెడ్డి, కోశాధికారి నర్సింహులు ముదిరాజ్, నాయకులు రామకృష్ణ రెడ్డి, ధర్మారావు, రాంరెడ్డి, కిరణ్, కనకారెడ్డి, ప్రేమ్‌కుమార్, కనకయ్య, దామోదర్‌రెడ్డి, శంకర్‌రెడ్డి, రహీం, మౌలానా తదితరులు పాల్గొన్నారు.


పాపిరెడ్డినగర్ బస్తీ సమస్యలపై అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న స్థానికులు

డివిజన్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా


దీన్‌దయాళ్‌నగర్‌లో సమస్యలను అడిగి తెలుసుకున్న కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్

బాలానగర్: ఫతేనగర్ డివిజన్ పరిధిలోని దీన్‌దయాల్‌నగర్, కార్మికనగర్, అమృత నగర్ తండా వారి సమక్షంలో దీన్‌దయాల్‌నగర్ అసోసియేషన్ పబ్లిక్ కాంటాక్ట్ కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించింది. ఈ కార్యక్రమానికి హాజరైన కార్పొరేటర్ పండాల సతీష్‌గౌడ్ మాట్లాడుతూ.. దీన్‌దయాల్‌నగర్‌లో 4 ఇంచుల పైపులైన్ వేసి తాగునీటిని సరఫరా చేసి సమస్యను పరిష్కరించామన్నారు. అదే విధంగా డ్రైనేజీ సమస్యను సైతం పరిష్కరించామని తెలిపారు. కార్మిక్‌నగర్‌లో జీఓ.58 సమయాన్ని పొడిగించారని బస్తీ వాసులు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ సందర్భంగా దీన్‌దయాల్‌నగర్ బస్తీలోని నాలా బ్రిడ్జి ఎత్తును పెంచాలని... కార్మిక్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రం నిర్మించాలని.. ఒక కమ్యూనిటీహాల్‌ని నిర్మించాలని స్థానికులు కోరారు. ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లి సమస్యలను త్వరగా పరిష్కరించే విధంగా కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో అధికారులు ఏఈ పవన్‌రెడ్డి, మౌనిక, అనిల్, ట్రాఫిక్ ఎస్ఐ శుక్రవర్ధన్‌రెడ్డి, ఎస్ఎఫ్ఏ దుర్గయ్యా తదితరులు పాల్గొన్నారు.

కాలనీ కాంటాక్ట్‌తో సమస్యలకు పరిష్కారం

కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు


ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకుంటున్న కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు

భాగ్యనగర్‌కాలనీ: హైదర్‌నగర్ డివిజన్ పరిధిలోని కృష్ణవేణి కాలనీ, శ్రీరాంనగర్, సాయి ప్రశాంత్‌నగర్‌లలో మంగళవారం జరిగిన కాలనీ కాంటాక్ట్ కార్యక్రమంలో సంబంధిత అధికారులతో స్థానిక కార్పొరేటర్ నార్నే శ్రీనివాసరావు పాల్గొని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలనీల్లో పేరుకుపోయిన సమస్యలను పరిష్కరించడానికి అధికారులతో కలిసి పర్యటిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో హైదర్‌నగర్ డివిజన్ గౌరవ అధ్యక్షుడు దామోదర్‌రెడ్డి, అధికారులు వర్కు ఇన్‌స్పెక్టర్ దేవి, కమ్యూనిటీ ఆర్గనైజర్ ముస్తఫా, టౌన్‌ప్లానింగ్ చందు, డ్రైనేజీ సూపర్‌వైజర్ నరేందర్, వీధిలైట్లు సూపర్‌వైజర్ సుధాకర్, స్వామి, వాసు, రాజుసాగర్, వెంకట్, మల్లేష్, మహేష్, నరేందర్, నరేష్, ప్రవీణ్, సుబ్బలక్ష్మి, శృతి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కు అందజేత

రాయదుర్గం: ఆపదలో ఉన్నవారికి సీఎంఆర్ఎఫ్ ఆపన్నహస్తం అందిస్తోందని ఎమ్మెల్యే గాంధీ పేర్కొన్నారు. గచ్చిబౌలి డివిజన్ రాయదుర్గంకు చెందిన గణేష్‌కు అత్యవసర చికిత్స నిమిత్తం సీఎంఆర్ఎఫ్ ద్వారా మంజూరైన లక్షరూపాయల ఎల్ఓసీ పత్రాన్ని లబ్ధిదారులకు అందించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్‌పార్టీ నాయకులు రామకృష్ణ, అష్రఫ్, సలావుద్దీన్ పాల్గొన్నారు.

మేనేజర్ చాంబర్‌లో చెత్తపోసి కార్పొరేటర్ నిరసన

ప్రజల బాధలు అధికారులకు తెలియాలనే చేశా: మహేందర్


డ్రైనేజ చెత్తా చెదారాన్ని అధికారి కార్యాలయంలో పోసి నిరసన తెలిపిన మూసాపేట కార్పొరేటర్ మహేందర్

మూసాపేట: మూసాపేట డివిజన్‌లో డ్రైనేజీ నుంచి తీసిన వ్యర్థాలను తరలించకపోవటంపై మూసాపేట కార్పొరేటర్ కోడిచెర్ల మహేందర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మంగళవారం ఆయన మూసాపేట సెక్షన్ హెచ్ఎండబ్ల్యూఎస్ అండ్ ఎస్‌బీ మేనేజర్ సలోమి కార్యాలయంలో చెత్తను తీసుకెళ్లి ఫ్లోర్‌పై పోసి నిరసన వ్యక్తం చేశారు. జీఎం, డీజీఎంలకు ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా పట్టించుకోవడం లేదన్నారు. రెండు డివిజన్లకు కలిపి ఒకే ట్రాక్టర్ ఉందంటూ మేము ఏమీ చేయాలంటూ మాట్లాడుతున్నారని పేర్కొన్నారు. 20 రోజుల క్రితం తీసిన ఈ మట్టిని అలాగే వదిలేశారన్నారు. అధికారులు చిత్తశుద్ధి లేకుండా ప్రవర్తిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అందుకే ప్రజలు పడే ఇబ్బందులు అధికారులకు తెలియజేయాలని ఈ విధంగా మట్టిని తీసుకొచ్చి మేనేజర్ చాంబర్‌లో పోశానని తెలిపారు. ఇప్పటికైనా అధికారుల్లో చలనం రాకపోతే ప్రజలే వచ్చి ఆఫీసులో వచ్చి పోస్తారన్నారు. ఈ కార్యక్రమంలో వినోద్, పోలాకి కిషోర్, గోపి, జానకి, రాజేశ్వరి, సాయి, సురేష్, అబ్బాస్, కర్రెమ్మ, మాణిక్ తదితరులు పాల్గొన్నారు.



2561 మందికి కంటి పరీక్షలు

బాలానగర్: బాలానగర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో 10 కంటి వెలుగు కేంద్రాలు పనిచేస్తున్నాయి. 2561 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. 120 మందికి కళ్ల జోడులు అందజేశారు. మరో 29 మందికి ప్రత్యేక కళ్లద్దాల కోసం ఆర్డర్ చేశారు. 50 మందికి కంటి శస్త్ర చికిత్సకై కంటి ఆసుపత్రికి రిఫర్ చేశారు. నేటికి 66వ రోజు కంటి పరీక్ష కేంద్రం దిగ్విజయంగా నడుస్తున్నారు.

సీవరేజ్ నిర్మాణంతో ఇబ్బందులు తలెత్తవు

ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు


కేపీహెచ్‌బీ డివిజన్‌లో సీవరేజ్ పైపులైన్ నిర్మాణ పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే, కార్పొరేటర్, అధికారులు

కేపీహెచ్‌బీకాలనీ: కల్వరి టెంపుల్, ఎస్ఎంఆర్, బుద్ధ వర్టెక్స్, గోపాల్‌నగర్‌ల మీదుగా సీవరేజ్ పైపులైన్ నిర్మాణం ప్రాంతాన్ని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మంగళవారం కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు, అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.12కోట్లతో పైపులైన్ నిర్మాణం చేపట్టే విధంగా అధికారులకు పలు సూచనలు చేశారు. ఎస్‌టీపీ ప్లాంట్ ద్వారా నీరు శుద్ధి చేసి మైసమ్మ చెరువుకు వెళ్లేలా ఏర్పాటు చేయాలని అధికారులకు తెలిపారు. ఈ పైపులైన్ నిర్మాణంతో ఈ కాలనీవాసులకు మురుగు, వరద నీటి ఇబ్బందులు తలెత్తవన్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రి కేటీఆర్‌ల సహకారంతో అన్ని విభాగాల్లో నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసుకుంటున్నామని అన్నారు. పనులు పూర్తయితే భారీ వర్షం పడినా నీరు నిల్వదని పేర్కొన్నారు. ప్రజలు అభివృద్ధికే పట్టం కట్టాలని పిలుపునిచ్చారు. ఎన్నో ఏళ్లుగా కానీ పనులు నేడు ముఖ్యమంత్రి కేసీఆర్ తొమ్మిదేళ్ల కాలంలో చేసి చూపించారని అన్నారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు, ఎంఆర్‌ఓ గోవర్ధన్, వాటర్‌వర్క్స్ అధికారులు జీఎం ప్రభాకర్, ఎస్ఈ చెన్నారెడ్డి, ఈఈ సత్యనారాయణ, డీఈ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

బస్తీ దవాఖానాలో తాత్కాలిక పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేయాలి

మోతీనగర్: కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మంగళవారం అల్లాపూర్‌లో పోలీస్‌స్టేషన్ కోసం ఏర్పాటు చేసే ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా రాజీవ్‌గాంధీనగర్‌లోని బస్తీ దవాఖానాలో తాత్కాలికంగా పోలీస్‌స్టేషన్ ఏర్పాటు చేసి బస్తీ దవాఖానాను 5 నెలల పాటు ఇతర ప్రాంతానికి తరలించే విధంగా ఏర్పాట్లు చేయాలని సూచించారు. నూతనంగా పోలీస్‌స్టేషన్ నిర్మించిన వెంటనే బస్తీ దవాఖానాను యథాస్థితిలో కొనసాగించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో అల్లాపూర్ కార్పొరేటర్ సబిహా బేగం, ఏసీపీ చంద్రశేఖర్, మేడ్చల్ జిల్లా మైనార్టీ అధ్యక్షుడు మహమ్మద్ గౌసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

జీహెచ్‌ఎంసీ, విద్యుత్ శాఖ సమన్వయంతో పనిచేయాలి

సమీక్షలో అధికారులతో ఎమ్మెల్యే

కూకట్‌పల్లి: కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో మంగళవారం ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, జీహెచ్‌ఎంసీ, విద్యుత్ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న రోడ్లు, డ్రైనేజీ పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. అందుకు సంబంధించి ప్రణాళికలను సిద్ధం చేయాలని అధికారులకు ఆదేశించారు.అకాల వర్షాలతో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతున్న నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ, విద్యుత్ శాఖ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. ప్రజలు ప్రమాదాల బారిన పడకుండా సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని, నివారణ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏమైనా ఇబ్బందులు ఉంటే వెంటనే తన దృష్టికి తీసుకురావాలన్నారు.


ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే